




# మద్యం పారుతోంది.. జ్ఞానం కరువవుతోంది!

- ప్రతి గ్రామంలో వైన్ షాపు.. ఏదీ గ్రంథాలయం?
- ప్రభుత్వాల ప్రాధాన్యత ఎటువైపు?

**తుడుం జితేందర్, జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**

ఒక దేశ భవిష్యత్తు ఆ దేశ పాఠశాలల్లో, గ్రంథాలయాల్లో రూపుదిద్దుకుంటుంది. కానీ ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే భవిష్యత్తు 'మద్యం' బాటిళ్లలో బందీ అవుతున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలోని ప్రతి మండలంలో, ఊరూరా మద్యం దుకాణాలు దర్శనమిస్తున్నాయి కానీ, కనీసం ఒక్క గ్రంథాలయం కూడా లేని గ్రామాలు వేలల్లో ఉండటం శోచనీయం. చదువు మనిషికి విజ్ఞానాన్ని ఇస్తుంది, హక్కుల పట్ల అవగాహన కల్పిస్తుంది, అన్నింటికీ మించి పాలకులను ప్రశ్నించే ధైర్యాన్ని ఇస్తుంది.

### ప్రశ్నించే గొంతుకలకు 'మత్తు' మందు?

యువత చదువుకుని మేల్కొంటే తమ వైఫల్యాలను ఎండగడతారనే భయంతోనే నాయకులు గ్రంథాలయాల ఏర్పాటుపై నిర్లక్ష్యం వహిస్తున్నారా? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. యువతను మద్యం మత్తులో ముంచితే వారు ప్రశ్నించే తత్వాన్ని కోల్పోతారని, తద్వారా తమ రాజకీయ పబ్బం గడుపుకోవచ్చని పాలకులు భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. కేవలం ఆదాయం కోసమే ప్రభుత్వం మద్యాన్ని ప్రోత్సహిస్తోంది. దీనివల్ల జరుగుతున్న నష్టాలు అపారం.

### మద్యం తెస్తున్న మరణ మృదంగం

మద్యం బానిసలుగా మారి ఎంతోమంది తండ్రులు, కొడుకులు ప్రాణాలు కోల్పోతుంటే, ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. లివర్ వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక రోగాలతో లక్షలాది మంది అకాల మరణం చెందుతున్నారు. 'డ్రింక్ ఏండ్ డ్రైవ్' వల్ల జరుగుతున్న ప్రమాదాల్లో అమాయకులు బలి అవుతున్నారు. మద్యం దుకాణాల ద్వారా వచ్చే ఆదాయం కంటే, చదువుకున్న యువత ద్వారా వచ్చే మేధో సంపత్తి దేశానికి ఎంతో మేలు చేస్తుంది.

### ప్రతి పంచాయతీలో ఒక లైబ్రరీ!

ప్రతి గ్రామ పంచాయతీలో కచ్చితంగా ఒక గ్రంథాలయం ఏర్పాటు చేయాలి. యువతకు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, దినపత్రికలు అందుబాటులో ఉంచాలి. మద్యం అమ్మకాలపై ఉన్న శ్రద్ధ, విద్యా సౌకర్యాల కల్పనపై చూపాలి. మద్యానికి బానిసైన మనిషి ఆలోచన కోల్పోతాడు, కానీ పుస్తకానికి బానిసైన మనిషి సమాజాన్ని మారుస్తాడు. ఇప్పటికైనా పాలకులు తమ ధోరణి మార్చుకోవాలి. ఊరికో మద్యం షాపు కాదు.. ఊరికో గ్రంథాలయం కావాలి. అప్పుడే అభివృద్ధి చెందిన భారతదేశం సాధ్యమవుతుంది.

# ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలి

**కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బిజెపి భారీ ర్యాలీ**

**ఇచ్చోడ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పణ**



**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు దాటినా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలతో సహా అనేక హామీలను నెరవేర్చలేదని బిజెపి నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత పాలన సాగిస్తూ ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. బిజెపి రాష్ట్ర అధిష్టానం ఆదేశాల మేరకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఇచ్చోడ మండల కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండలాధ్యక్షుడు టేహారే రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ్ రావ్, బోత్ నియోజకవర్గ కన్వీనర్ బబారావు కదం పాల్గొన్నారు. వీరితో పాటు పార్టీ నాయకులు భీమ్ రెడ్డి, కొల్లూరి శేఖర్, పాండు రంగ్ హరాన్, సుభాష్ పటేల్, బొడ్డు సత్యప్రకాష్, నరాల శ్రీనివాస్ జాదవ్, కసబ్ చంద్, వినాయక్ రావ్, నానాజీ దాము పటేల్, విద్యాసాగర్ రెడ్డి, రాఫిక్ తో పాటు కార్యకర్తలు భారీగా హాజరయ్యారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ తనిఖీ

**పౌష్టికాహారం నాణ్యతగా అందించాలని ఆదేశం**

**గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి**



**బిచ్కుంద, మార్చి 17 (జనం పవర్):**

కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపల్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి సీమా రమేష్ షెట్కార్, వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి ప్రేమ్‌సేట్ సందర్శించారు. నాణ్యత లోపం లేకుండా ప్రతి గర్భిణికి, బాలింతలకు, చిన్నారులకు ప్రతిరోజు పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ టీచర్లకు తెలిపారు. పిల్లలకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించి అందుబాటులో ఉన్న సౌకర్యాలను సమీక్షించారు. అవసరమైన సామగ్రి, సదుపాయాలపై అధికారులకు సూచనలు చేస్తూ పిల్లలకు మరింత మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సేవలో భాగంగా చిన్నారుల, బాలింతలు, గర్భిణుల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ముందుకు నడవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

# జలమే జగతికి మూలం.. నీటి పొదుపుపై అవగాహన

- బస్వాపూర్‌లో బాలవికాస ఆధ్వర్యంలో మానవహారం
- విద్యార్థులతో భారీ ర్యాలీ.. పోటీల నిర్వహణ




**కోహెడ, మార్చి 16 (జనం పవర్):**

సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలో బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో నీటి ప్రాముఖ్యతపై నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ చేపట్టారు. గ్రామపంచాయతీ కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేసి నీటి పొదుపుపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.

### నీటిని ఒడిసి పట్టుకోవాలి

ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని, జలమే జగతికి మూలమని బాలవికాస సంస్థ ఏరియా కోఆర్డినేటర్లు పిల్లి జ్యోతి, నిర్మల, శ్రీమతి వివరించారు. జలం లేనిదే జీవనం లేదని, ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. పొలాల వద్ద ఫామ్ పాండ్లు ఏర్పాటు చేసుకొని నీటిని నిల్వ చేసుకోవాలని కోరారు. నీటి విలువను గుర్తించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు.

### విద్యార్థులకు పోటీలు

ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోతు లింగం, ఎంఈఓ పద్మయ్య, అనిత, ఉపాధ్యాయ బృందం, ఉప సర్పంచ్ తాటిపాముల ప్రవీణ్, పాలకవర్గం, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ఉత్సాహం గ్రామస్తుల్లో చైతన్యం నింపింది.

# ప్రకృతి సాగుతోనే ఆరోగ్యకరమైన సమాజం

**జన్నారంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ**

**125 మంది రైతులకు ప్రోత్సాహక కిట్ల పంపిణీ**



**జితేందర్, జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**

రసాయన రహిత వ్యవసాయమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ జన్నారం మండలంలో వేగవంతమైంది. మంగళవారం పోనకల్ రైతు వేదికగా జన్నారం క్లస్టర్ పరిధిలోని 125 మంది ఎంపిక చేసిన రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే నాణ్యమైన దిగుబడులు ఎలా సాధించాలో ఈ సందర్భంగా వివరించారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మళ్లించడం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందడమే ఈ మిషన్ ప్రధాన లక్ష్యం. కార్యక్రమంలో భాగంగా తొలుత రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయంపై నిపుణులు సూచించిన మెళకువలు, పెట్టుబడి లేని సాగు పద్ధతులు, సేంద్రియ ఎరువుల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. సాగులో రసాయనాల వాడకాన్ని తగ్గించి భూసారాన్ని ఎలా పెంచుకోవాలో వివరించారు. డిజిటల్ మాధ్యమం ద్వారా నిపుణులు రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు.

### రైతులకు కిట్ల పంపిణీ

శిక్షణ అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గమ్ లక్ష్మీనారాయణ, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) మల్యాల త్రిసంధ్య చేతుల మీదుగా రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను అందజేశారు. ఈ కిట్‌లో బ్యాగ్, డైరీ, నోట్ బుక్, క్యాలెండర్, పెన్, టోపీ, ఐడీ కార్డులు ఉన్నాయి. వీటిని సద్వినియోగం చేసుకుని ప్రకృతి సాగులో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు దివ్య, అక్రమ్ తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు కొత్తపల్లి వనిత శ్రీనివాస్, పంజాల సురేష్, పిండి నరేష్, మహేందర్ పాల్గొన్నారు. కృషి సఖీలు జక్కుల రజిత, గోగు అంజలి, పెద్ద సంఖ్యలో రైతులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


# సిద్దిపేటలో మెగా ఎడ్యుకేషన్ ఫేర్

- 35కి పైగా విశ్వవిద్యాలయాల భాగస్వామ్యం
- విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన




**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో సిద్దిపేటలోని ఆర్ఎస్ పెట్రో గార్డెన్ వేదికగా మెగా ఎడ్యుకేషన్ ఫేర్ ఘనంగా జరిగింది. ఈ ఫేర్‌కు రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు భారీగా తరలివచ్చారు. వివిధ విద్యా అవకాశాలపై సమాచారం సేకరించారు. ఈ ప్రదర్శనలో తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న 35కి పైగా విశ్వవిద్యాలయాలు పాల్గొన్నాయి. మల్లారెడ్డి, ఆత్మీయ, మార్వాడి, ఎల్‌సీఎఫ్ఏఐ, సందీప్ యూనివర్సిటీ వంటి ప్రముఖ విద్యాసంస్థలు త వ ం కోర్సుల గురించి అవగాహన కల్పించాయి.







### కోర్సులపై నిపుణుల మార్గదర్శకత్వం

బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ వంటి సాంకేతిక కోర్సులతో పాటు లైఫ్ సైన్సెస్, ఎ టల్ మేనేజ్‌మెంట్, బిజినెస్ స్కూల్స్ వివరాలను అందించారు. దేశీయ, విదేశీ విశ్వవిద్యాలయాలకు సంబంధించిన ఓవర్సీస్ కన్సల్టెన్సీలు కూడా పాల్గొన్నాయి. అడ్మిషన్లు, స్కాలర్‌షిప్‌లు, కోర్సు ఎంపికపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశాయి. కెరీర్ గైడెన్స్ సెషన్ల ద్వారా విద్యార్థుల సందేహాలను నిపుణులు నివృత్తి చేశారు. తమ ఆసక్తులకు అనుగుణంగా భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి ఈ వేదిక ఉపయోగపడింది.

### ఉన్నత విద్యాపథంపై అవగాహన

ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ కడవేర్గు మంజుల రాజనర్సు, సిద్దిపేట టౌన్ బీఆర్ఎస్ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డి, త్రీటౌన్ సీఐ టీ లక్ష్మీ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తెలంగాణ విద్యా సమితి రాష్ట్ర అధ్యక్షులు పెండం తారక్ గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుత గ్లోబల్ పరిస్థితుల్లో సరైన కోర్సులను ఎంచుకోవడం ముఖ్యమన్నారు. ఇలాంటి ఫెయిర్లు విద్యార్థులకు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వేడుకలో మెదక్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఆలేటి విజయేందర్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు వేల్పుల శ్రీనివాస్ పాల్గొన్నారు. వీరితో పాటు బండారి సుధాకర్, మహేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గణేష్ నాయక్ హాజరయ్యారు. విద్యా సమితి ప్రతినిధులు, విద్యార్థులు, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థులు తమ విద్యా భవిష్యత్తుపై స్పష్టత పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

జనం పవర్

బుధవారం
18 మార్చ్ 2026

# ఇంద్రేశం మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాల జోరు

**అధికారుల ఉదాసీనతపై స్థానికుల ఆగ్రహం**

**రాజ్యమేలుతున్న అవినీతి.. పట్టించుకోని ఉన్నతాధికారులు**

**పటాన్చెరు, మార్చి 17 (జనం పవర్):**
ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు విస్తృతంగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ కొంతమంది అవినీతి అధికారుల సహకారంతో అవి నిరాటంకంగా సాగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాల వల్ల అమాయక ప్రజలు మోసపోతున్నారు. నియమాలు పాటించని భవనాల్లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు భవిష్యత్తులో నష్టపోయే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు.

**కూల్చివేతలతో ప్రజలకు నష్టం**

నిర్మాణాలు పూర్తయిన తర్వాత మాత్రమే అధికారులు రంగంలోకి దిగుతూ కూల్చివేతలు చేపట్టడం వల్ల ప్రజలు ఆర్థికంగా తీవ్రంగా దెబ్బతింటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రశ్నించే వారిపై ఒత్తిళ్లు తెచ్చి ముడుపులతో గొంతులు మూయిస్తున్నారని కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో ఫిర్యాదులు నమోదవుతున్నాయి. నిర్మాణ దశలోనే అక్రమాలను అడ్డుకోవాల్సిన బాధ్యత అధికారులదేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**పొంచి ఉన్న ప్రమాదాలు**

నియమాలు ఉల్లంఘించి చేపడుతున్న కట్టడాల వల్ల భవిష్యత్తులో ప్రాణ ఆస్తి నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ ఉన్నతాధికారులు ఇప్పటివరకు స్పందించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటారా లేకపోతే అవినీతి కళ్లెం వేయకుండా ఇదే పరిస్థితి కొనసాగుతుందా అన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

# రంజాన్ ప్రార్థనలకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు

**ఈద్గా వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించిన నిర్మలా జగ్గారెడ్డి**

**అభివృద్ధి కోసం రూ. 3 కోట్లతో ప్రతిపాదనలు**



**సంగారెడ్డి, మార్చి 17 (జనం పవర్):**
సంగారెడ్డి పట్టణంలోని హాస్టల్ గడ్డ వద్ద గల ఈద్గా మైదానాన్ని సోమవారం టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పరిశీలించారు. రంజాన్ పండుగ రోజున ఈద్గా వద్ద వేలాదిమంది ముస్లిం సోదరులు నమాజ్‌లో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో ఈద్గా వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని, అక్కడికి వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆమె మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రంజాన్ పండుగ రోజు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని, అవసరమైతే ట్రాఫిక్ నియంత్రించాలని సంగారెడ్డి రూరల్ సీఐని ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఈద్గా అభివృద్ధి కోసం రూ. 3 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని, జగ్గారెడ్డి గారు త్వరలోనే నిధులు మంజూరు చేస్తారని వివరించారు. ఈద్గా వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించవద్దని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కూన సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ షఫీ హఫీజ్, కౌన్సిలర్ నవాజ్, ఫాయిజ్ పాల్గొన్నారు. వీరితో పాటు ఈద్గా కమిటీ సభ్యులు అతీకుద్దిన్, బాబర్, షఫీలతో పాటు మైనార్టీ నాయకులు అన్వర్, బబ్బు తదితరులు హాజరయ్యారు.

# గ్రామాల అభివృద్ధికి రూ. 60 లక్షల నిధులు

**బచ్చాయిపల్లి పంచాయతీ భవనానికి భూమిపూజ**

**కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ**

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**
సిద్దిపేట రూరల్ మండలంలోని గ్రామాల అభివృద్ధికి రూ. 60 లక్షల నిధులను మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ తెలిపారు. మంగళవారం బచ్చాయిపల్లి, సీతారాంపల్లి గ్రామాల్లో అభివృద్ధి పనులను గ్రామ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. సిద్దిపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధుల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, భవిష్యత్తులో మరిన్ని మౌలిక వసతుల కోసం నిధులు తీసుకురావడానికి ప్రయత్నిస్తానని ఆయన అన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి సహకారంతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వారా బచ్చాయిపల్లిలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రూ. 20 లక్షలు కేటాయించారు. డ్రైనేజీ నిర్మాణానికి రూ. 30 లక్షలు, సీతారాంపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 10 లక్షలు కేటాయించి పనులకు భూమిపూజ చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని హరికృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుర్గం ప్రేమలత యాదగిరి, ఉప సర్పంచ్ అనుపమ పాల్గొన్నారు. వీరితో పాటు మండల నాయకులు గుర్రం అంజిరెడ్డి, బండి శివకుమార్, దేవిరెడ్డి రాజారెడ్డి, బాబురెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజ బహదూర్ రెడ్డి, అరవింద్ హాజరయ్యారు. గ్రామాల అభివృద్ధికి సహకరిస్తున్న ప్రభుత్వానికి, అధికారులకు నాయకులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



# తల్లి కిడ్నీ దానంతో కుమారుడికి పునర్జన్మ

- యశోద ఆసుపత్రి వైద్యుల అద్భుత చికిత్స
- “నా ప్రాణం కన్నా కొడుకు జీవితం ముఖ్యం“ అన్న కన్నతల్లి
- కిడ్నీ వ్యాధి నుంచి కోలుకున్న 33 ఏళ్ల యువకుడు




**సంగారెడ్డి, మార్చి 17 (జనం పవర్):**
తల్లి ప్రేమకు మించినది ఏదీ లేదని మరోసారి నిరూపితమైంది. అవయవ దానం ప్రాణాలను కాపాడగలదనే సత్యాన్ని వెలుగులోకి తెస్తూ హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్స్ వైద్యులు ఒక యువకుడికి నూతన జీవితం ప్రసాదించారు. ఎండ్ స్టేజ్ కిడ్నీ డిసీజ్ (ఈఎస్‌ఆర్‌డీ)తో బాధపడుతున్న 33 ఏళ్ల యువకుడికి విజయవంతంగా కిడ్నీ మార్పిడి చేశారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన శ్రీ దిలీప్ జంపాల రిఫ్లక్స్ నెఫ్రోపతీ కారణంగా క్రానిక్ కిడ్నీ డిసీజ్‌తో బాధపడుతూ కొంతకాలంగా రెగ్యులర్ హీమోడయాలసిస్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. ఆరోగ్య పరిస్థితి క్రమంగా దిగజారడంతో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ తప్ప మరే ప్రత్యామ్నాయం లేకుండా మారింది.

**కన్నతల్లి త్యాగం.. ఆశాకిరణం**

ఈ కీలక సమయంలో “నా ప్రాణం కన్నా నా కొడుకు జీవితం ముఖ్యం“ అని భావించిన తల్లి తన కిడ్నీని దానం చేయడానికి ముందుకు రావడం ఆ కుటుంబానికి ఆశాకిరణంగా మారింది. వైద్యుల సమగ్ర పరిశీలన అనంతరం కార్డియాలజీ, పల్మోనాలజీ, న్యూరాలజీ, యూరాలజీ తదితర విభాగాల నిపుణుల సమన్వయంతో అన్ని పరీక్షలు పూర్తి చేశారు. 2023 మే 31న లైవ్ రిలేటెడ్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్రచికిత్సను కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ మురళీనాథ్ వుక్కడల నేతృత్వంలోని ట్రాన్స్‌ప్లాంట్ నిపుణుల బృందం పూర్తి చేసింది. సర్జరీలో భాగంగా డోనర్ కిడ్నీని రోగి రక్తనాళాలకు అనుసంధానం చేసి మూత్ర ప్రవాహం సక్రమంగా ఉండేందుకు డీజే స్టెంట్ ఏర్పాటు చేశారు.

**మెరుగుపడిన ఆరోగ్యం**

శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్యంలో గణనీయమైన మెరుగుదల కనిపించింది. ట్రాన్స్‌ప్లాంట్ చేసిన కిడ్నీ సక్రమంగా పనిచేస్తోందని వైద్యులు తెలిపారు. ముఖ్యంగా సర్జరీకి ముందు 5.34 గా ఉన్న సిరం క్రియాటినిన్ స్థాయి డిశ్చార్జ్ సమయానికి 0.65కు పడిపోవడం చికిత్స విజయాన్ని స్పష్టంగా చూపుతోంది. ప్రస్తుతం రోగి స్థిరమైన పరిస్థితిలో ఉండగా ఇమ్యునోసప్రెసివ్ థెరపీ కొనసాగిస్తూ డిశ్చార్జ్ చేశారు. ఎండ్ స్టేజ్ కిడ్నీ డిసీజ్ ఉన్న రోగులకు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఉత్తమ చికిత్స అని, ఇది వారి జీవన నాణ్యతను పెంచుతుందని డాక్టర్ మురళీనాథ్ వుక్కడల తెలిపారు.

**అవయవ దానమే మహోన్నతం**

వైద్యులు అవయవ దానం ప్రాణాలను రక్షించే మహోన్నత సేవ అని పేర్కొన్నారు. ముఖ్యంగా కుటుంబ సభ్యుల నుంచి లివింగ్ డోనర్ ట్రాన్స్‌ప్లాంట్లు మెరుగైన ఫలితాలు ఇస్తాయని, అర్హులైన రోగుల కోసం కుటుంబాలు ముందుకు రావాలని సూచించారు. మూడున్నర దశాబ్దాలుగా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధునిక సాంకేతికతతో, అనుభవజ్ఞులైన వైద్యులతో ప్రపంచ స్థాయి చికిత్సను అందిస్తూ రోగుల ఆరోగ్యానికి కట్టుబడి ఉందని వారు వెల్లడించారు.

# ‘జనం పవర్‘ కథనానికి స్పందన.. ఇద్దరు సర్వేయర్ల కేటాయింపు

- జన్నారంలో భూ సర్వే సమస్యల పరిష్కారానికి చర్యలు
- జిల్లా యంత్రాంగంలో కదలిక తెచ్చిన ఇన్వెస్టిగేటివ్ స్టోరీ




**తుడుం జితేందర్, జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**
మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సర్వే సమస్యలపై ‘జనం పవర్‘ పత్రికలో తుడుం జితేందర్ రాసిన ఇన్వెస్టిగేటివ్ కథనం జిల్లా యంత్రాంగంలో కదలిక తెచ్చింది. రైతుల గోడును, రెవెన్యూ కార్యాలయం చుట్టూ వారు పడుతున్న ఇబ్బందులను కళ్లకు కట్టినట్లు వివరించిన ఈ కథనానికి ఉన్నతాధికారులు వెనువెంటనే స్పందించారు. మండలంలో నిలిచిపోయిన భూ సర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం తక్షణమే ఇద్దరు సర్వేయర్లను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**ప్రజా సమస్యపై ‘జనం పవర్‘ పోరాటం**

గత ఏడాది కాలంగా జన్నారం తహశీల్దార్ కార్యాలయంలో భూ సర్వేలు అగమ్యగోచరంగా మారిన విషయం తెలిసిందే. సర్వేయర్లు అందుబాటులో లేకపోవడం, సాంకేతిక సాకులు చెబుతూ దరఖాస్తులను పక్కన పెట్టడంతో రైతులు నరకయాతన అనుభవించారు. ఈ గందరగోళ పరిస్థితిని, రైతుల ఆవేదనను ‘జన్నారంలో అగమ్యగోచరంగా భూ సర్వేలు‘ అనే శీర్షికతో ‘జనం పవర్‘ వెలుగులోకి తెచ్చింది.

**వార్త ప్రభావం.. వెనువెంటనే నియామకం**

కథనం ప్రచురితమైన కొద్ది గంటల్లోనే జిల్లా రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. మండలంలోని వందలాది పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించడమే లక్ష్యంగా ఇద్దరు అధికారులను నియమించింది. కొత్తగా వచ్చిన సర్వేయర్లు పెండింగ్‌లో ఉన్న హద్దుల నిర్ణయం, సబ్-డివిజన్ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టనున్నారు. కార్యాలయాల చుట్టూ తిరగలేక ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించి నష్టపోతున్న తరుణంలో ఈ నియామకం తమకు పెద్ద ఊరటనిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**కలెక్టర్ ప్రత్యేక దృష్టి**

స్థానిక నేతల డిమాండ్ మేరకు, పత్రికా కథనం ఆధారంగా జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇకపై ప్రతి దరఖాస్తును గడువులోగా పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో పత్రికలు కీలక పాత్ర పోషిస్తాయని ‘జనం పవర్‘ నిరూపించిందని స్థానిక రైతులు కొనియాడారు.

# తాటి చెట్ల నరికివేతపై గీత కార్మికుల ఆగ్రహం

**సీఎం పర్యటన కోసం చెట్లు తొలగించొద్దు**

**బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగం గౌడ్ విమర్శ**



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**
సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో తాటి చెట్లను నరికివేయడం గీత కార్మికుల జీవనోపాధిపై దెబ్బతీసే చర్యగా మారుతుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనగోని లింగం గౌడ్ విమర్శించారు. నంగునూరు మండలం నర్మెట గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం కోసం ఈ నెల 22న సీఎం రానున్న సందర్భంగా ఫ్యాక్టరీ పరిసరాల్లో ఉన్న తాటి చెట్లను తొలగించడం సరికాదని తెలిపారు. మంగళవారం గీత కార్మికులతో కలిసి తాటి చెట్ల తొలగింపును అడ్డుకున్న ఆయన గ్రామంలో ఫ్యాక్టరీ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశించిన కార్మికులకు ఇది నష్టం కలిగిస్తోందన్నారు. సుమారు 60 మంది గీత కార్మికులు తాటి చెట్లపై ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. తాటి చెట్లే తమకు ఆధారమని, వాటిని నరికివేస్తే తమ బతుకులు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. హెలిప్యాడ్ ఏర్పాటుకు ప్రత్యామ్నాయ స్థలం ఉన్నప్పటికీ రైతుల పొలాల్లోని తాటి చెట్లను నరికివేయాలని అధికారులు ప్రయత్నించడం తగదని అన్నారు. తాటి చెట్లను రక్షిస్తూ హెలిప్యాడ్‌ను వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గీత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ కాలంలో గీత కార్మికుల ఉపాధి కోసం తాటి, ఈత మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తుచేసి ప్రస్తుతం అలాంటి చర్యలు కనిపించడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో నంగునూరు సహకార సంఘం మాజీ చైర్మన్ కోల రమేష్ గౌడ్, గ్రామ నాయకులు, గీత కార్మిక సంఘం ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి పీఐబీ కృషి చేయాలి

**టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి**

**సంగారెడ్డి, మార్చి 17 (జనం పవర్):** వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) కృషి చేయాలని, దీనికి సంబంధించిన మరిన్ని పథకాలు అమలు చేయాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి కోరారు. పీఐబీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో మంగళవారం ‘వార్తాలాప్‘ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి శిక్షణా తరగతులు జర్నలిస్టులకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి తగినట్లుగా సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత కాలంలో జర్నలిజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా జర్నలిస్టులు అప్డేట్ కావాలని సూచించారు. గ్రామీణ ప్రాంత జర్నలిస్టులకు వర్క్ షాపుల ద్వారా ఎంతో మేలు జరుగుతుందని యాదగిరి తెలిపారు. అదే సమయంలో వారి సంక్షేమంపై ప్రభుత్వాలు శ్రద్ధ చూపాలని కోరారు. ముఖ్యంగా జర్నలిస్టుల ఉద్యోగ భద్రతపై దృష్టి సారించాలన్నారు. జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య బీమా కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వార్తలు కవర్ చేసే క్రమంలో ప్రమాదాలను లెక్కచేయకుండా జర్నలిస్టులు పరుగెడుతున్నారని, తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి వృత్తికి కట్టుబడి ఉంటున్నారని చెప్పారు. ప్రమాదాల బారిన పడినప్పుడు ఆయా కుటుంబాలకు ప్రమాద బీమా ఎంతో ఆసరాగా ఉంటుందని వివరించారు. వృత్తి నైపుణ్యాన్ని గ్రామీణ స్థాయి వరకు విస్తరించాలని, మరిన్ని వర్క్ షాపులు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. దీనిపై పీఐబీ అదనపు డీజీ శృతి పాటిల్ సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్ షాపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు, గ్రామీణ జర్నలిస్టులు పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సవాళ్లను పీఐబీ దృష్టికి తీసుకెళ్లడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.







# సిద్ధిపేట కలెక్టరేట్ వద్ద ఆశావర్కర్ల ఆందోళన

- రూ. 18,000 ఫిక్స్‌డ్ వేతనం కోసం ముట్టడి
- తోసుకుని లోపలికి వెళ్లేందుకు యత్నం

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

ఆశా వర్కర్లకు నెలకు రూ. 18,000 ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రభుత్వం నిధులు కేటాయించి నిర్ణయం తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం రెండో రోజు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టిన ఆశా వర్కర్లు భారీగా ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ ప్రధాన గేట్లను తోసుకుంటూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

### అధికారుల హామీతో నిరసన విరమణ

అధికారులతో చర్చలు జరిపిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు తాత్కాలికంగా నిరసనను విరమించారు. అనంతరం కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి బయటకు వచ్చి సీఐటీయూ నాయకులతో చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గోపాలస్వామి మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆశా వర్కర్లకు రూ. 18,000 ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన కేటాయింపులు ఉన్నప్పటికీ పట్టణ ప్రాంతాల్లో ఒకే ఆశా వర్కర్‌పై అధిక పని భారం పడుతోందని తెలిపారు.

### వేధింపులపై ఆగ్రహం

అధికారులు, కింది స్థాయి సిబ్బంది నుంచి వేధింపులు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, సీఐటీయూ జిల్లా నాయకులు, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ప్రభుత్వం తమ గోడు వినకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.

# దుర్భర జీవితాలు గడుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

**సమస్యల పరిష్కారం కోరుతూ శ్రీరాంపూర్ జీఎంకు వినతి**

**సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్**



**శ్రీరాంపూర్, మార్చి 17 (జనం పవర్):**

మంచిర్యాల జిల్లా సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికై మంగళవారం శ్రీరాంపూర్ జీఎంకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీలు కే భద్రయ్య, ముష్క సమ్మయ్య పాల్గొన్నారు. సింగరేణి కాలరీస్‌లో కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ కార్మికులు చాలా తక్కువ వేతనాలతో జీవనోపాధి గడుపుతూ అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని వారు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సింగరేణిలో సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కనీస వేతనాలు అలాగే హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని ఈ సందర్భంగా కోరారు.

### పెండింగ్ సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తి

ఓబీ పనులలో పనిచేస్తున్న ఆపరేటర్లకు హైపర్ కమిటీ వేతనాలు ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం వెంటనే కల్పించాలని విన్నవించారు. సమ్మె కాలంలో విధించే జరిమానాలను రద్దు చేసి యధావిధిగా 'నో వర్క్ – నో పే' విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు దొడ్డిపట్ల రవీందర్, ఉపాధ్యక్షులు రాచర్ల చంద్రమోహన్, కే ప్రభాకర్ పాల్గొన్నారు. పి సురేంద్ర చారి, నర్సింగరావు, వెంకటేష్, సదయ్య, లక్ష్మి, ప్రవీణ్ తో పాటు కాంట్రాక్టు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పైన పేర్కొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి కార్మికులను ఆదుకోవాలని అధికారులను కోరారు.



# కాకతీయ టెక్నో హైస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**నైతిక విలువలతోనే విద్యార్థుల ఎదుగుదల: జగ్గు మల్లారెడ్డి**

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాకతీయ టెక్నో హైస్కూల్‌లో నర్సరీ, ఎల్‌కేజీ విద్యార్థుల కోసం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ బి-స్మార్ట్ స్టేట్ జనరల్ సెక్రటరీ జగ్గు మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. చిన్న తరగతుల నుంచే విద్యార్థులకు ఉత్తీర్ణత గుర్తింపుగా సర్టిఫికెట్లు అందించడం వారి అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. విద్యార్థులు మహానీయుల అడుగుజాడల్లో నడిచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జగ్గు మల్లారెడ్డి ఆకాంక్షించారు. తమకు విద్యను బోధించిన గురువులకు, చదివిన పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల చిన్ననాటి విజయాలను ఇలా గుర్తించడం వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని నిర్వాహకులు వెల్లడించారు.




# సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన

**బిచ్కుంద కస్తూరిబా గాంధీ విద్యాలయంలో సదస్సు**



**బిచ్కుంద, మార్చి 17 (జనం పవర్):**

సైబరు నేరాలు, వేసవి కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వివిధ సామాజిక అంశములపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆదేశాల మేరకు బిచ్కుంద సబ్ ఇన్‌స్పెక్టర్ జీ. రాజు ఆధ్వర్యంలో పోలీస్ కళాబృందంచే అవగాహన కార్యక్రమం జరిగింది. మైనర్లపై జరుగు నేరాలు, ప్రేమలు, మోసాల పట్ల అవగాహన కల్పించారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలని, మంచి లక్ష్యంతో చదువుకోవాలని సూచించారు. ఏ చిన్న పొరపాటు చేసినా జీవితాలు నాశనం అవుతాయని, తల్లిదండ్రులు చెప్పినట్లు వినాలని తెలిపారు. అత్యవసర సమయంలో డయల్ 100 కాల్ చేయాలని, షీ టీమ్ నంబర్ 8712686094, సైబర్ నేరాల టోల్ ఫ్రీ నంబర్ 1930 గురించి వివరించారు. పోలీస్ కళాబృందం ఇన్చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ యూ. శేషరావు, పీసీ సాయిలు మాటలు, పాటల ద్వారా కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు పీసీ అనిల్, డబ్ల్యూపీసీ పార్వతి, ప్రిన్సిపాల్ రాగిణి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

# గ్యాస్, నిత్యావసరాల ధరలను తగ్గించాలి

**బీజేపీ ప్రభుత్వ విధానాలపై సీపీఐ నిరసన**

**బెజ్జంకిలో ఖాళీ సిలిండర్లతో ఆందోళన**



**బెజ్జంకి, మార్చి 17 (జనం పవర్):**

బీజేపీ ప్రభుత్వ విధాన వైఫల్యాలతో గ్యాస్, నిత్యవసర సరుకుల ధరలు పెరిగాయని, వాటిని కేంద్ర ప్రభుత్వం తక్షణమే నియంత్రించాలని సీపీఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఖాళీ సిలిండర్లు, ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల సామాన్యుల బతుకులు భారమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదలను అరికట్టడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దాడులతో ఎల్పీజీ గ్యాస్ సరఫరా తగ్గి ధరలు పెరిగాయని రూపేష్ ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రపంచానికి రారాజుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కెనడాను అమెరికాలో కలపడం, గ్రీన్ లాండ్ పై హెచ్చరికలు జారీ చేయడం వంటి చర్యలను ప్రస్తావించారు. వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మధురోను అపహరించిన ఘటనలను ఈ సందర్భంగా వివరించారు. అమెరికా ఆధిపత్య ధోరణి వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంగేమ్ మధు, కల్లూరి బాలమల్లు, దొంతర వేణి మహేష్ పాల్గొన్నారు. గంగుల బాలయ్య, గుండయ్య, చంద్రయ్య, బండి సమ్మయ్య తో పాటు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సామాన్య ప్రజల పక్షాన సీపీఐ నిరంతరం పోరాడుతుందని, ప్రభుత్వం తన మొండి వైఖరి వీడి ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు.

# కాలుష్యం కాటుకు మంజీరలో చేపల మృతి

**మౌనవ్రతంలో పీసీబీ అధికారులు**

**మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతినే ప్రమాదం**

**చౌటకూర్, మార్చి 17 (జనం పవర్):**

చౌటకూర్ మండలంలోని వెండికోల్ గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న మంజీర నది కాలుష్య కోరల్లో చిక్కుకుంది. భారీ ఎత్తున చేపలు మరణించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామ ప్రజలకు జీవనాధారంగా, పశువులకు తాగునీటి వనరుగా ఉండే ఈ నది ప్రమాదకర స్థితికి చేరుకుంది. సమీపంలోని కొన్ని పరిశ్రమలు తమ వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా నేరుగా నదిలోకి విడుదల చేస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఈ కాలుష్య నీటి ప్రభావంతో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి చేపలు ఊపిరాడక మృతి చెందుతున్నాయి. గత కొన్ని రోజులుగా నది నీటిలో అసహజమైన వాసన, రంగు మార్పు కనిపిస్తోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


### అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

చేపల మరణంతో మత్స్యకారుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. పర్యావరణాన్ని హానికరంగా మార్చే పరిశ్రమలపై పీసీబీ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని వెండికోల్ సర్పంచ్, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వెంటనే నది నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాలుష్యం వల్ల ప్రజల ఆరోగ్యం, పశువుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలుష్యానికి కారణమైన పరిశ్రమలను గుర్తించి వాటిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరిశ్రమలపై కఠిన పర్యవేక్షణ ఉండాలని సూచిస్తున్నారు.



# జగ్గారెడ్డి పీసీసీ అధ్యక్షుడైతే 100 సీట్లు ఖాయం

**- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు**





**సంగారెడ్డి, మార్చి 17 (జనం పవర్):**

జగ్గారెడ్డి వంటి మాస్ లీడర్ టీపీసీసీ ప్రెసిడెంట్ అయితే వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో 100 సీట్లు గెలవడం పక్కా అని రాష్ట్ర ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సోమవారం అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేస్తూ జగ్గారెడ్డిని కాంగ్రెస్ పార్టీలోని సీనియర్ నేతగా, రెండు తెలుగు రాష్ట్రాల్లో పాపులర్ లీడర్‌గా అభివర్ణించారు. మాజీ నేత పీజేఆర్ తరహాలో మాస్ ఫాలోయింగ్ ఉన్న వ్యక్తి జగ్గారెడ్డి అని ఆయన ఉద్ఘాటించారు. ప్రస్తుత పరిస్థితుల్లో జగ్గారెడ్డి వంటి వ్యక్తి పీసీసీ అధ్యక్షుడిగా ఉండాల్సిన అవసరం ఉందని కోమటిరెడ్డి అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కింది స్థాయి కార్యకర్త నుంచి పై స్థాయి నాయకుల వరకు అందరినీ కలుపుకుని పోయే శక్తి జగ్గారెడ్డికి మాత్రమే ఉందని పేర్కొన్నారు. గతంలో సీఎం రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్షులు అయిన సమయంలోనూ జగ్గారెడ్డి పేరు తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో అధిష్టానం జగ్గారెడ్డి నాయకత్వంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సీనియర్ నేతలు సైతం ఈ ప్రతిపాదనను బలపరుస్తుండటంతో అధిష్టానం నిర్ణయంపై ఆసక్తి నెలకొంది.

# బీఆర్ఎస్ అసత్య ప్రచారాలపై రంగు అశోక్ గౌడ్ మండిపాటు

**వడ్ల కొనుగోళ్లపై తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు**

**రైతులను తప్పుదారి పట్టించవద్దని హెచ్చరిక**

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**



నంగునూరు మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రంగు అశోక్ గౌడ్ బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రచారాలపై తీవ్రంగా స్పందించారు. ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలో ఇటీవల నిర్వహించిన ప్రెస్ మీట్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వడ్ల కొనుగోలు అంశంపై మాట్లాడని విషయాలను బీఆర్ఎస్ నాయకులు వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. రైతులను తప్పుదారి పట్టించేలా అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఎన్ని లక్షల మెట్రిక్ టన్నుల వడ్లనైనా కొనుగోలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఇప్పటికే స్పష్టం చేశారని తెలిపారు.

### రైతులు తప్పుడు వార్తలు నమ్మవద్దు

బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలు రైతులను తప్పుదారి పట్టిస్తూ అనవసర ఆందోళనలకు గురిచేస్తున్నారని అశోక్ గౌడ్ విమర్శించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అవసరమైనన్ని వడ్లను కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని కోరారు. ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తోందని, ఇలాంటి చిల్లర రాజకీయాలకు రైతులు లొంగవద్దని హితవు పలికారు.

# సిద్దిపేట కమిషనరేట్ పోలీసులకు వైద్య పరీక్షలు

**శిబిరంలో పరీక్షలు చేయించుకున్న ఎస్సై సౌజన్య**



**బెజ్జంకి, మార్చి 17 (జనం పవర్):**

సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆదేశాల మేరకు మంగళవారం బెజ్జంకి ఎస్సై బోయిని సౌజన్యతో పాటు పోలీస్ సిబ్బంది బెజ్జంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు పోలీస్ సిబ్బందికి రక్తపోటు, షుగర్, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సూచనలు ఇచ్చారు. ఈ శిబిరం ద్వారా పోలీసులు తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని అవసరమైన జాగ్రత్తలు తీసుకునే అవకాశం కలిగింది.

## ఒత్తిడిని అధిగమించాలి

పోలీసులు విధుల్లో తరచుగా ఎదురయ్యే ఒత్తిడి, అనియమిత పని వేళల కారణంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని వైద్యులు ఈ సందర్భంగా సూచించారు. సరైన ఆహార నియమాలు పాటించాలని, వ్యాయామం చేయాలని తెలిపారు. నిరంతరం ప్రజల రక్షణ కోసం శ్రమించే పోలీసులు తమ ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని కోరారు. సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న అన్ని స్థాయిల పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఈ వైద్య శిబిరాలు నిర్వహించడంపై హర్షం వ్యక్తమవుతోంది. ఇది పోలీసుల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని పలువురు అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అలసిపోయే సిబ్బందికి ఇటువంటి శిబిరాలు ఎంతో ఊరటనిస్తాయని పేర్కొన్నారు.

# ఇఫ్తార్ విందులు ఐక్యతకు ప్రతీకలు

**ఎమ్మెల్యే జీఎంఆర్**

**రామచంద్రపురం ఈద్గాలో ఘనంగా వేడుకలు**

**ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని వెల్లడి**



**పటాన్‌చెరు, మార్చి 17 (జనం పవర్):**

రంజాన్ పవిత్ర మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు ఐక్యతకు ప్రతీకలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని ఈద్గాలో సీనియర్ నాయకులు ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు విరమించారు.

## సంక్షేమానికి పెద్దపీట

పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ముస్లింల ఆర్థిక అభ్యున్నతి, సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే జీఎంఆర్ ఈ సందర్భంగా తెలిపారు. గంగా జమునా తెహజీబ్ సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. మత సామరస్యంతోనే అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి మాజీ ప్రోటెమ్ చైర్మన్ భూపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున హాజరైన ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇఫ్తార్ విందులో అందరూ కలిసి పాల్గొనడం ద్వారా సామరస్యం వెల్లివిరిసింది.





# ఇల్లు వదిలి వెళ్తున్నారా?

# ఈ జాగ్రత్తలు తప్పనిసరి!



**తాళం వేసిన ఇళ్లే దొంగల లక్ష్యం: సీఐ రమణ మూర్తి**

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక**

**తుడుం జితేందర్, జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**

జన్నారం మండలంలో వరుస దొంగతనాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లక్సెట్టిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణ మూర్తి సూచించారు. తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు జరుగుతున్నాయని, ఈ విషయంలో ప్రజలు స్వీయ నియంత్రణ పాటించాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు తమ పరిధిలో డప్పు చాటింపు వేయించి ప్రజలను చైతన్యపరచాలని ఆదేశించారు. పోలీసులు నిరంతరం ఆస్తిపాస్తుల రక్షణ కోసం కృషి చేస్తున్నారని, ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## నగలు, నగదు భద్రతపై సూచనలు

శుభకార్యాల కోసం లేదా దూర ప్రయాణాల నిమిత్తం ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు తమ ఇంట్లోని నగలు, నగదును వెంట తీసుకెళ్లాలని లేదా బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. ఎక్కువ రోజులు ఇల్లు విడిచి వెళ్లాల్సి వస్తే సంబంధిత లోకల్ పోలీస్ స్టేషన్‌లో ముందస్తు సమాచారం అందించాలని తెలిపారు. దీనివల్ల ఆ ప్రాంతాల్లో గస్తీ పెంచే అవకాశం ఉంటుందని వివరించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

## సీసీ కెమెరాల ఏర్పాటు అవసరం

సాధ్యమైనంత వరకు ఇళ్ల వద్ద, వీధుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను అరికట్టవచ్చని అధికారులు వెల్లడించారు. ఇరుగుపొరుగు ఇళ్లకు తాళం వేసి ఉంటే వాటిపై కూడా ఒక కన్నేసి ఉంచాలని, నేరరహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఐ రమణ మూర్తి విజ్ఞప్తి చేశారు. అప్రమత్తతతోనే దొంగతనాలను అరికట్టడం సాధ్యమని ఆయన స్పష్టం చేశారు.



# మతసామరస్యానికి వేదికైన కవ్వాల్

- ఘనంగా ఇఫ్తార్ విందు
- బాలాజీ హాస్పిటల్ అధినేత కాల్వ రవి ఆధ్వర్యంలో ఏర్పాటు
- హిందూ-ముస్లింల ఐక్యతకు నిదర్శనం



**తుడుం జితేందర్, జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**

మండలంలోని కవ్వాల్ గ్రామంలో గంగా-జమునా తెహజీబ్ వెల్లివిరిసింది. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరుల కోసం బాలాజీ హాస్పిటల్ అధినేత కాల్వ రవి సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కన్నుల పండువగా సాగింది. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ఊరుమ్మడి పండుగలా ఈ కార్యక్రమం జరిగింది. సాయంత్రం నమాజ్ అనంతరం ముస్లిం సోదరులతో కలిసి హిందువులు ఒకే పంక్తిలో కూర్చుని విందు ఆరగించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఖర్జూర పండ్లు, పండ్ల రసాలతో ఉపవాస దీక్షలను విరమించారు. ఈ దృశ్యం గ్రామంలోని సోదరభావాన్ని చాటిచెప్పింది.

## రంజాన్ త్యాగానికి ప్రతీక

ఈ సందర్భంగా కాల్వ రవి మాట్లాడుతూ రంజాన్ పండుగ ముస్లింలకు అత్యంత పవిత్రమైనదని పేర్కొన్నారు. క్రమశిక్షణ, దానగుణం, సహనం కలిగిన ఈ మాసంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. మనమందరం కలిసి మెలిసి ఉండటమే సమాజానికి బలమని, ఇలాంటి వేడుకలు మనుషుల మధ్య దూరాన్ని తగ్గించి ప్రేమానురాగాలను పెంచుతాయని కొనియాడారు. బాలాజీ హాస్పిటల్ ద్వారా వైద్య సేవలే కాకుండా సామాజిక ఐక్యత కోసం ఆయన చేస్తున్న కృషిని అందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని ఈ విందును విజయవంతం చేశారు. కవ్వాల్ గ్రామం మత సామరస్యానికి చిరునామాగా నిలిచిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.




# బసవేశ్వర మందిరంలో మాస శివరాత్రి వేడుకలు

**భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజల నిర్వహణ - ఆలయానికి వెండి శట గోపురం విరాళం**

**సదాశివపేట, మార్చి 17 (జనం పవర్):**

మాస శివరాత్రి సందర్భంగా సదాశివపేటలోని బసవేశ్వర మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల విగ్రహాలకు ఎడ్ల బజార్ వీరశైవ సమాజం సభ్యులు 108 పుష్పాలతో విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మంత్రోచ్చారణలు, హారతులతో ఆలయం ఆధ్యాత్మిక కాంతులతో మెరిసింది. ఈ సందర్భంగా కశెట్టి లలిత - రమేష్ దంపతులు, వారి కుమారుడు కోడలు డాక్టర్ శ్రావ్య - సుజన్ దంపతులు కలిసి ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారంగా వెండి శట గోపురాన్ని అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు దాతలను ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఆధ్యాత్మికతను పెంపొందించడమే కాకుండా, పరస్పర ఐక్యతను బలోపేతం చేస్తాయని పాల్గొన్న భక్తులు పేర్కొన్నారు.



